సాక్షి
జనగామ

శుక్రవారం : 22 : సెప్టెంబర్ : 2023

పోటెత్తిన 'కత్తెర' పంట

- జిల్లాలో మూడో పంటగా వరి
- 45వేల ఎకరాలకు పైగా సాగు
- ముమ్మరంగా సాగుతున్న కోతలు
- 7,700 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



జనగామ మార్కెట్‌కు గురువారం అమ్మకానికి వచ్చిన కత్తెర వరి పంట

జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి రెండు పంటలే పండుతాయి.. అయితే జిల్లాలో మాత్రం మూడో పంటగా వరిని కత్తెర సాగు చేస్తున్నారు. యాసంగి(రబీ) సీజన్ ముగిసిన వెంటనే.. వానాకాలం సీజన్(ఖరీఫ్)కు మధ్యలో మూడో పంటగా కత్తెర సాగు ఇక్కడ ప్రత్యేకం. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో సుమారు 45వేల ఎకరాలకు పైగా, యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ మూడో పంటగా వరి సాగు చేశారు. గడిచిన 20 రోజులుగా పంట కోతలు ముమ్మరం కావడంతో జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తుతోంది.

జిల్లాలో పూర్వం నుంచి యాసంగి, వానాకాలం సీజన్ మధ్య వరిని మూడో పంటగా కత్తెర సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా నేలలు ఉండడంతో ఇది సాధ్యమవుతోందని రైతులు చెబుతున్నారు. యాసంగి ముగిసిన తర్వాత ఏటా ఫిబ్రవరి మొదటి వారంలో కోతలు ప్రారంభిస్తారు. తిరిగి ఏప్రిల్‌లో కత్తెర (మూడో పంట) సాగు పనులు మొదలుపెడుతారు. జూన్ మొదటి వారం వానాకాలం(ఖరీఫ్) సీజన్ ప్రారంభ సమయంలో నార్లు సిద్ధం చేసుకుని జూలై నాటికి నాట్లు పూర్తి చేస్తారు. ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ మొదటి వారంలోపు కత్తెర పంట కోతలు ప్రారంభిస్తారు. కత్తెర పంట దిగుబడుల అమ్మకాలు పూర్తయ్యేలోపు.. అక్టోబర్ 15వ తేదీ వరకు వానాకాలం పంట కోత దశకు వస్తుంది. వానాకాలం పంటకు ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుండగా.. కత్తెర పంటను క్వింటాకు రూ.200 నుంచి రూ.300 వరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా కత్తెర పంట సమయంలో మద్దతు ధర అందించి నష్టపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

35 శాతం మంది రైతుల మొగ్గు..

జిల్లా వ్యాప్తంగా మూడో పంటగా కత్తెర వరి సాగుకు 35 శాతం మంది రైతులు మొగ్గు చూపించారు. యాసంగి, వానాకాలం సీజన్‌లో 8 నెలలు కష్టపడే అన్నదాతలు.. మధ్యలో వచ్చే రెండు నెలల పాటు మరికొంత మంది కాస్త విశ్రాంతి తీసుకుంటారు. మిగతా వారు ఈ ఏడాది 45వేల ఎకరాల్లో సాగు చేశారు. కత్తెర దిగుబడులు మొదలు కావడంతో జనగామ వ్యవసాయ మార్కెట్‌కు రోజు వారీగా వెయ్యి బస్తాలకు పైగా ధాన్యం వస్తోంది. మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం ఆధ్వర్యంలో రైతులకు మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. క్వింటాకు గరిష్ట ధర రూ.1,959, కనీస ధర రూ.1,655 మోడల్ ప్రైజ్ రూ.1,909 వరకు పలుకుతోంది. ఈనెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు జనగామ వ్యవసాయ మార్కెట్‌లో కత్తెర దిగుబడులను 211 మంది రైతుల నుంచి 11,851 బస్తాల(7,708 క్వింటాళ్లు) ధాన్యం కొనుగోలు చేశారు. మరో నెల రోజుల పాటు కత్తెర దిగుబడులు రానున్నాయి.



పక్క ఫొటోలోని రైతు పేరు కర్రె కృష్ణ. లింగాలఘణపురానికి చెందిన ఈయన తనకున్న ఐదు ఎకరాల పొలంలో కత్తెర వరి సాగు చేశాడు. రూ.80వేల వరకు పెట్టుబడి అయింది. రెండు రోజుల క్రితం హార్వెస్టర్‌తో పంట కోసి నేరుగా జనగామ మార్కెట్‌కు తీసుకువచ్చాడు. 220 బస్తాల దిగుబడి రాగా వ్యాపారులు క్వింటాకు రూ.1,900 ధర నిర్ణయించారు. కత్తెర సాగు సమయంలో యంత్రాల అద్దె తక్కువ, కూలీలు అందుబాటులో ఉండడం, వాతావరణ అనుకూలత కారణంగా ఎకరాకు 10 బస్తాలకు పైగా అదనపు దిగుబడి వస్తుందని రైతు కృష్ణ పేర్కొన్నాడు.

20 బస్తాల దిగుబడి వచ్చింది..



కత్తెర సమయంలో ఎకరంన్నర పొలంలో వరి సాగు చేసిన. రూ.25వేలకు పైగా పెట్టుబడి అయింది. 20 బస్తాల దిగుబడి రాగా జనగామ మార్కెట్‌కు తీసుకువచ్చిన. వ్యాపారులు సరుకు నాణ్యతను బట్టి క్వింటాకు రూ.1,869 ధర నిర్ణయించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు చేస్తే బాగుండేది.

– వడ్ల సుధాకర్, శ్రీనివాసపురం, ఆలేరు మండలం

పకడ్బందీగా కొనుగోళ్లు



కత్తెర వరి దిగుబడుల సమయంలో రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ధాన్యం నాణ్యత ఆధారంగా ధర పడిపోకుండా పర్యవేక్షిస్తున్నాం. తక్కువ ధర వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే సదరు వ్యాపారులతో మాట్లాడి రైతుకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. ధర తక్కువగా వచ్చినట్లు రైతు భావిస్తే తమ వద్దకు రావచ్చు.

– బాల్దె సిద్ధిలింగం, ఏఎంసీ చైర్మన్, జనగామ

న్యూస్‌రీల్

సివిల్ సప్లయ్ డీఎంగా ప్రసాదరావు బాధ్యతలు



జనగామ: జిల్లా సివిల్ సప్లయ్ డీఎంగా టీఎస్ఎస్.ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సంధ్యారాణి వరంగల్‌కు బదిలీ కావడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ప్రసాదరావు ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ ఆయనను సత్కరించారు.

స్టీల్ బ్యాంకు ప్రారంభం



జనగామ: మున్సిపల్ పరిధిలో మెప్మా ఆధ్వర్యాన మహిళా సంఘాలకు మరింత ఆర్థిక చేయూత అందించేందుకు పట్టణంలో కొత్తగా చేపట్టిన బర్తన్(స్టీల్) బ్యాంకును గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుహాసిని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి స్టీల్ బ్యాంకు దోహద పడుతుందని చెప్పారు. మహిళా సంఘాల కుటుంబ సభ్యులతో పాటు ఇతర శుభకార్యాలకు సంఘం వద్ద ఉన్న స్టీల్ సామగ్రి ఉపయోగపడుతుందని అన్నారు. మహమూద్ సమాఖ్య ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకు పని చేస్తుందని, ఇందులో స్టీల్ వంట సామగ్రి తక్కువ ధరకే అద్దెకు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జమునలింగయ్య, కమిషనర్ రజిత, మెప్మా పీడీ హర్షవర్ధన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ కేటాయించాలి



జనగామ రూరల్: మహిళా రిజర్వేషన్ 33 శాతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యాన పట్టణంలో ధర్నా నిర్వహించి మహిళా రిజర్వేషన్ బిల్లు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ.. 33 శాతం బిల్లుతో దొరలు పోయి దొరసానులు వస్తారని, దీనివల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. అందుకే రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందకూడదని పేర్కొన్నారు. 93 శాతం ఉన్న మహిళలకు ఉప కోటా కల్పిస్తే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరశురాం, కిష్టయ్య, రవి, కమల్, ప్రభాకర్, అనిల్, లక్ష్మణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించాలి



జనగామ: జిల్లాలో కత్తెర పంట వరి ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ మార్కెట్‌లో ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న ధాన్యం దిగుబడులకు ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన మద్దతు ధర చెల్లించాలన్నారు. ధర తగ్గకుండా మార్కెట్ పాలక మండలితో పాటు అధికారులు నిత్యం పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, తేజావత్ గణేష్‌నాయక్, హమాలీ సంఘం అధ్యక్షుడు గుండెల్లి రాజు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణ పత్రం అందజేత

జనగామ రూరల్: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షలు ఎమ్మెల్సీ కవిత చొరవతో గురువారం విరమించారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయంలో జాయినింగ్ పత్రం అందజేశారు. ప్రజాశిక్షా సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కవిత చర్చలు జరిపి పాఠశాల విద్యాశాఖ మంత్రి, కమిషనర్ దేవసేనతో ఫోన్ మాట్లాడారని, దీంతో సమ్మె విరమిస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు.

బీసీ కులాలకు ఆర్థిక చేయూత

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఆర్థిక సాయం పత్రాలు అందుకున్నవారితో మంత్రి

పాలకుర్తి: అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు ఆర్థిక చేయూత అందించిన సీఎం కేసీఆర్ త్వరలో మరింత మందికి సహాయం చేయనున్నారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నియోజకవర్గ పరిధి 290 మంది బీసీలకు గురువారం పాలకుర్తిలో రూ.2.90 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు గ్రామీణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, ముఖ్యమంత్రి వారికి అన్ని విధాలా సదుపాయాలు కల్పించారని చెప్పారు. 14 బీసీ కులాలకు ఆర్థిక చేయూత కల్పించడం వల్ల పనులు చేస్తూ కుటుంబ స్థితిని మెరుగు పర్చుకుంటారని పేర్కొన్నారు. తమ కుటుంబ సహకారంతో ఎంతో మందికి చదువు, ఉద్యోగాల కల్పనకు సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ రామ్మూర్తి, మూడు జిల్లాల బీసీ కార్పొరేషన్ ఈడీలు, జిల్లాల అధికారులు, ఎంపీపీలు నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ యాకాంతరావు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేయిస్తారా..?

- ఏబీవీపీ ఉమ్మడి జిల్లా విభాగ్ కన్వీనర్ చింతకింది సంతోష్
- 'పల్లా' దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట



ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

జనగామ రూరల్: అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేయిస్తారా అని ఏబీవీపీ ఉమ్మడి జిల్లా విభాగ్ కన్వీనర్ చింతకింది సంతోష్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ వీసీపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందంటూ గురువారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. కేయూ పీహెచ్‌డీ కేటగిరి–2లో జరిగిన అవినీతి అక్రమాలను ప్రశ్నించిన విద్యార్థులపై పోలీసుల చేత దాడులు చేయించారని, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో అనుభవం లేని వ్యక్తిని వీసీగా నియమించడం దారుణమన్నారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థి నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. అనురాగ్ వర్సిటీలా ప్రభుత్వ యూనివర్సిటీలను ప్రైవేట్‌గా మార్చాలంటూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యపై మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు తోట హృతిక్ సాయి, పగిడిపల్లి కార్తిక్, అరవింద్, నవీన్, అవుల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశుడికీ.. వానర తిప్పలు



గణాలకు అధిపతి అయిన గణనాథుడికి కూడా వానరాల తిప్పలు తప్పడం లేదు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాటికొండలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉండడంతో మండపంలో పూజాసామగ్రి, ప్రసాదం, ఇతర ఫలహారాలను వానరాల నుంచి రక్షించేందుకు నిర్వాహకులు వలలతో రక్షణ ఏర్పాటు చేశారు. – స్టేషన్‌ఘన్‌పూర్

రైతులందరికీ రుణమాఫీ అమలు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్: జిల్లాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడేలా చూడాలని అధికారులను కోరారు. కొంత మందికి అకౌంట్లలో డబ్బులు పడడంలేదని, అలాంటి వారు ఏఈఓ వద్దకు వెళ్లి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. రుణం తీసుకున్న బ్యాంకులో అకౌంట్ ఉంటే డబ్బు జమవుతుందని, అకౌంట్ క్లోజ్ అయిన.. మారిన వారికి ఇతర అకౌంట్లలో పడతాయని చెప్పారు. ఒక వేళ రైతు మరణించి ఉంటే వారి వారసులు బ్యాంకు మేనేజర్‌ను కలిసి సంబంధిత పత్రాలు అందజేయాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, బ్యాంకు అధికారులు, ఎల్‌డీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసేందుకే బూటకపు హామీలు

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

జనగామ: తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ బూటకపు హామీలను తెరపైకి తీసుకు వస్తున్నదని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనే తపనతో కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు.. ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఏ మేరకు అమలు చేస్తున్నారో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఉత్తుత్తి హామీలను నమ్మరని అన్నారు. బీజేపీకి తెలంగాణ అంటే గిట్టదని, అడుగడుగునా అవమాన పరుస్తూనే ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పైసా సాయం చేయడం లేదని ఆరోపించారు. ఉమ్మడి వరంగల్‌లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదని, తెలంగాణ ప్రజలు మూడోసారి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధుల బేబీ, చిట్ల జయశ్రీ ఉపేందర్‌రెడ్డి, ఎడవెల్లి కృష్ణారెడ్డి, బెలిదె వెంకన్న, కందుకూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తుంటే అడ్డుపడుతున్నారు

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



దరువేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తాను నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే కొందరు గిట్టనివారు, అసూయపరులు, దుండగులు, దుర్మార్గులు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఇప్పగూడెం ఎస్సీ కాలనీకి చెందిన మాదిగ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలకు గురువారం హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కాలనీలో నిర్వహించిన ర్యాలీలో రాజయ్య డప్పు దరువేసి ఆకట్టుకున్నారు. పూజల అనంతరం మరోసారి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో కలిసి ఈ ప్రాంతంలో పనిచేశానని, ఇప్పగూడెంలో ఎక్కువ ఇందిరమ్మ ఇళ్లు తమ హయాంలోనే వచ్చాయన్నారు. 2014 నుంచి 2023 వరకు ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఎమ్మెల్యేగా తనకే వచ్చిందని చెప్పారు. చిత్తశుద్ధితో పనిచేస్తుంటే పడనివారు, గిట్టనివారు, అసూయపరులు ఈ పేరంతా రాజయ్యకు వస్తుందనే అక్కసుతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జనవరి 17 వరకు తానే ఎమ్మెల్యేగా ఉంటానని, ఎవ్వరు అడ్డువచ్చినా ఆ వినాయకుడే చూసుకుంటాడని ఉద్వేగంగా అన్నారు. ఎస్సీ కాలనీకి ప్రత్యేకంగా సీడీఎఫ్ నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నానని, గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శివునిపల్లి బరోడాబ్యాంక్ వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారపాక రవి, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, నాయకులు ఆకుల కుమార్, చట్ల యాకయ్య, బొంకూరి మహేష్, దయాకర్, తాటికాయల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో సకల సౌకర్యాలు

వచ్చే ఏడాదిలో జరగనున్న మేడారం మహాజాతరకు సకల సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి గురువారం మేడారం చేరుకున్న ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

– ఎస్‌ఎస్ తాడ్వాయి

– వివరాలు 8లో▸



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేసి మొక్కుతున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్

ఈఎంఆర్‌ఐలో ఉద్యోగావకాశాలు

జనగామ రూరల్: ఈఎంఆర్ఐ(108)లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా కోఆర్డినేటర్ మంద శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం రెండు ఉద్యోగాలకు గాను.. ఆస్పత్రి బేస్ ఈఎమ్‌టీలో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ పూర్తి చేసి.. వయసు 28 ఏళ్లు నిండిన వారు, అలాగే బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో 5 ఏళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన జిల్లా ఆస్పత్రిలో ఇంటర్వ్యూ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్గీకరణ చేయకపోతే రాజకీయ సమాధి చేస్తాం

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో




మహాప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

జనగామ రూరల్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీని రాజకీయ సమాధి చేస్తామని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యామ్ అన్నారు. గురువారం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జనగామ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన మహా ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 70 సంవత్సరాలుగా రాజ్యాంగ ఫలాలు దళితులకు అందకుండా అగ్రవర్ణాల వారు దోచుకున్నారని, వారికి కేంద్రంలోని బీజేపీ సర్కారు కొమ్ముకాస్తున్నదని అన్నారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నా వర్గీకరణ ప్రకటన చేయకపోవడం దారుణమని అన్నారు. పైన రాజశేఖర్ అధ్యక్షతన చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమంలో నాయకులు కొయ్యడ మల్లేష్, బొట్ల మహేష్, సోమశేఖర్, నిర్మల భాస్కర్, గువ్వల రవి, కొడిదేటి కుమార్, తాళ్లపల్లి కుమార్, ఏలియా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వికటించిన ఇంజక్షన్.. మహిళ మృతి

- పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల రాస్తారోకో
- అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ వాహనం అడ్డగింత
- మూడు గంటలపాటు నిలిచిన వాహనాలు



లక్ష్మి మృతదేహం



ఎమ్మెల్యే రెడ్యానాయక్ వాహనం ఆపి మాట్లాడుతున్న మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు

దేవరుప్పుల: గ్రామీణ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు దేవరుప్పుల పోలీస్‌స్టేషన్ ఎదుట జనగామ–సూర్యాపేట రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.. ధర్మాపురం జీపీ పరిధి పడమటితండాకు చెందిన జాటోతు లక్ష్మి(30)కి జ్వరం రావడంతో కొడకండ్ల మండలం రామన్నగూడెంలో గురువారం ఓ సీనియర్ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అతను ఇంజక్షన్ వేసిన తర్వాత సదరు మహిళ అస్వస్థతకు గురైంది. దీంతో సదరు ఆర్ఎంపీ సూచన మేరకు జనగామకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఇంజక్షన్ వికటించడం వల్లే లక్ష్మి మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని రామన్నగూడానికి తరలించేందుకు యత్నించగా న్యాయం చేస్తామని ఎస్సై శ్రీ.శ్రవణ్‌కుమార్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో వాహనంలో మృతదేహం తీసుకుని దేవరుప్పుల పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నాక.. మృతురాలి ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రహదారిపై రాస్తారోకోకు దిగారు. దీంతో వాహనాలు నిలిచిపోవడంతో స్థానిక పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేయడానికి చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాల అలాగే ఉండిపోయాయి. ఈ క్రమంలో ఆ దారిలో డోర్నకల్‌కు వెళ్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ వాహనాన్ని గిరిజనులు అడ్డుకుని విషయం చెప్పారు. ఆయన వాహనం దిగి పోలీసులతో మాట్లాడి వారికి న్యాయం చేయాలని చెప్పినా శాంతించలేదు. ఇంతలో పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్ అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు సహనం కోల్పోయి పోలీసులు, ఆందోళనకారులను నిలదీస్తూ వాగ్వాదానికి దిగారు. ఎట్టకేలకు మృతురాలి కుటుంబానికి చట్టపరంగా న్యాయం చేస్తామని పోలీసులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

24న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

హనుమకొండ: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ 24వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వీరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిజామాబాద్‌లో నిర్వహించే 42వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. జనవరి 02, 2008 తర్వాత జన్మించిన వారై ఉండి ఆసక్తి గల బాలబాలికలు 24న ఉదయం 9గంటలకు జేఎన్ఎస్‌లోని బ్యాడ్మింటన్ కోర్టు వద్ద తనకు రిపోర్టు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుంటలో పడి పశువుల కాపరి మృతి

బయ్యారం: ఓ పశువుల కాపరి కుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వినోభానగర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన కొండమీది మల్లయ్య(60) పశువులకాపరిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మేత నిమిత్తం పశువులను గ్రామ సమీపంలోని జీవికుంట వద్దకు తీసుకెళ్లాడు. కుంటలో దిగిన పశువులు బయటకు రావడం లేదు. దీంతో పశువులను బయటకు తీసుకొచ్చేందుకు కుంటలో దిగాడు. ఈ క్రమంలో కుంటలోని దామెరతీగ చుట్టుకోవడంతో మునిగిపోయాడు. రాత్రి అయిన మల్లయ్య ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం ప్రయత్నించగా గురువారం కుంటలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

మున్నేరువాగులో ఒకరి గల్లంతు


వెంకన్న

మహబూబాబాద్ రూరల్ : మున్నేరువాగులో ఒకరు గల్లంతయ్యారు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మోడెం వెంకన్న (35) మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం పనిలేకపోవడంతో గ్రామ శివారులోని మున్నేరువాగు వద్దకు చేపల వేటకు వెళ్లాడు. అనంతరం అక్కడే ఉన్న పృథ్వీ అనే వ్యక్తితో కలిసి మున్నేరువాగు చెక్ డ్యాం మీదుగా అవతలి వైపున ఉన్న గాంధీపురం గ్రామ శివారు వరకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో చెక్ డ్యాం మీది నుంచి వాగులో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.

నిలువెత్తు నిర్లక్ష్యం..

తడిసిన సింథటిక్ ట్రాక్‌పైనే అథ్లెటిక్స్ పోటీలు

- ఇబ్బందులు పడిన క్రీడాకారిణులు
- వర్షంలోనే భోజనం.. తడుస్తూ క్యూలైన్‌లో అన్నం కోసం బారులు
- నిర్వాహకుల పనితీరుపై అసహనం
- కనీస వసతుల కల్పనలో అలసత్వం


వర్షంలో తడుస్తూ భోజనం కోసం క్యూలో నిల్చున్న క్రీడాకారిణులు


షూ లేకుండా తడిసిన ట్రాక్‌పై రన్నింగ్ చేస్తున్న క్రీడాకారిణులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వర్షంలో తడుస్తూ అన్నం కోసం క్యూలో నిల్చున్న వీరంతా వినాయక మండపం వద్ద భక్తులు కాదు.. అనేక సంవత్సరాల కఠోర సాధన ఫలితంగా వచ్చే ప్రతిభను చాటేందుకు వచ్చిన యువ క్రీడాకారిణులు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కనిపించిన ఈ చిత్రం క్రీడాభిమానులను కలిచివేసింది. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఎంతో దూరం నుంచి వచ్చిన క్రీడాకారిణులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కనీస వసతుల కల్పనలో అలసత్వం వహించడంపై సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు నిర్వాహకుల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు.

జేఎన్ఎస్‌లో పోటీలు

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ ఉమెన్ త్రూ యాక్షన్ (అస్మిత) ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అన్ని కేటగిరీల్లో బాలికలు, మహిళలలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని మరింత ప్రోత్సహించాలన్నదే అస్మిత ప్రధాన లక్ష్యం. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారిణులకు ఒక్క రోజు పోటీలు నిర్వహించాలని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ)కు కేంద్రం సూచించింది. కాగా, ఏఎఫ్ఐ నిర్వహణ బాధ్యతలను అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు అప్పగించింది.

పోటీలను మమ అనిపిస్తే చాలు..

ప్రతిభ, ప్రోత్సాహం పక్కన పెడితే కేవలం పోటీలు నిర్వహిస్తే చాలు అన్నట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ వ్యవహరించిందని టెక్నికల్ అఫీషియల్స్, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు వాపోయారు. గురువారం ఉదయం 5.30 గంటల నుంచి నగరంలో దాదాపు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో జేఎన్ఎస్‌లోని సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ తడిసిపోవడంతో పాటు అక్కడక్కడ నీరు నిలిచింది. దీంతో స్కిడ్ అవుతుందని క్రీడాకారులు షూ లేకుండానే పోటీల్లో పాల్గొన్నారు.

తడిసిన ట్రాక్‌పై రన్నింగ్..

తడిసిన సింథటిక్ ట్రాక్‌పై అథ్లెట్లు రన్నింగ్ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. వివిధ కేటగిరీల్లో పాల్గొన్న క్రీడాకారిణులకు 100, 200, 400, 800, 1500 మీటర్ల రన్నింగ్‌తో పాటు డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 600 క్రీడాకారిణులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఖేలో ఇండియా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, వచ్చే నెలలో జరిగే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు హనుమకొండ ఆతిథ్యం ఇస్తుందన్నారు. అనంతరం విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్, హనుమకొండ డీవైఎస్ఓ. గుగులోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, సంఘం బాధ్యులు ఐలి చంద్రమోహన్‌గౌడ్, ఎండీ గౌస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న చీఫ్‌విప్


వర్షంలోనే చెట్ల కింద భోజనం చేస్తున్న క్రీడాకారిణులు


షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి

మేడారంలో సకల సౌకర్యాలు

- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- లోపాలు తలెత్తకుండా జాతర ఏర్పాట్లు చేపట్టాలి : మంత్రి సత్యవతి రాథోడ్
- వీవీఐపీ అతిథి గృహ సముదాయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- మహాజాతర ఏర్పాట్లపై సమీక్ష


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి


ములుగులో వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

ఎస్ఎస్ తాడ్వాయి/ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మేడారంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, జాతరకు ముందుగానే మరమ్మతులు పూర్తి చేసి భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. గురువారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో మహాజాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.14 కోట్లతో మేడారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశామన్నారు. పస్రా – మేడారం రోడ్డులో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. రూ.12కోట్ల వ్యయంతో ప్రత్యేక గదులు, డార్మెటరీలను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ మహాజాతరలో లోపాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత నాలుగు దఫాలు జరిగిన జాతరలో రూ.400 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించామన్నారు. 2024లో జరిగే జాతరను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఆరు నెలల ముందు నుంచే జాతర ఏర్పాట్లపై ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆదివాసీ బిడ్డ నాగజ్యోతిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్.. ములుగు జిల్లాకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. మల్లంపల్లి మండలం, ఏటూరునాగారం డివిజన్ ఏర్పాటుకు త్వరలోనే ఏర్పాట్లు జరగనున్నాయని తెలిపారు. ఈనెల 28న మంత్రి హరీష్‌రావు జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

మేడారానికి వచ్చిన మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హెలీప్యాడ్ పక్కన స్థలంలో రూ.2.15 కోట్లతో నిర్మించనున్న వీవీఐపీ అతిథి గృహ సముదాయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ములుగు జిల్లాకేంద్రంలో వ్యవసాయశాఖ కార్యాలయం ప్రారంభించారు. ఇంచర్ల జీపీ పరిధిలోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో రూ. 5 కోట్లతో నిర్మించనున్న భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఎస్పీ గాష్ ఆలం, ఐటీడీఏ పీఓ అంకిత్, ఈఓ. రాజేంద్రం, ఎంపీపీ వాణిశ్రీ, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, సర్పంచ్ శిడం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో జాతీయ మహాసభలు

- అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ వినోద్ కుమార్


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హన్మకొండ: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలు నవంబర్ 19, 20, 21 తేదీల్లో హనుమకొండ వేదికగా జరగనున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండ కాకతీయ కాలనీలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన సమయంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం జాతీయ మహాసభల వైస్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ చారిత్రక నగరం హనుమకొండలో జాతీయ మహాసభలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి జయరాజు మాట్లాడుతూ సభలకు దేశ వ్యాప్తంగా 3 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాజేందర్ రెడ్డి, హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు, కోశాధికారి మర్రి కొమురారెడ్డి, 'కుడా' చైర్మన్ సుందర్ రాజు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

డీన్ల పారదర్శకతను తప్పుపట్టడం హాస్యాస్పదం

కేయూ క్యాంపస్: డీన్ల పారదర్శకతను తప్పుపట్టడం హాస్యాస్పదమని కాకతీయ యూనివర్సిటీ ఆల్ ఫ్యాకల్టీ డీన్లు అయిలయ్య, మల్లారెడ్డి, మనోహర్, నర్సింహారెడ్డి, అమరవేణి, రాంనాథ్ కిషన్, విజయలక్ష్మి శ్రీనివాసులు గురువారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు పారదర్శకంగానే నిర్వహించామని డీన్లు అందరం ఒక ప్రకటన జారీచేశామని, ఆ ప్రకటన సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా విడుదల చేసిందన్నారు. ఆ ప్రకటనను అపహాస్యం చేస్తూ కేయూ డీన్లు పారదర్శకతను నిరూపించుకోవాలంటూ కేయూ జేఏసీ పేరున విడుదల చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డీన్లు వీసీ చేతిలో కీలుబొమ్మలంటూ జేఏసీ చేసిన ఆ ప్రకటన సరికాదన్నారు. స్వార్థపరుల చేతిలో కీలుబొమ్మలుగా మారి తమ విలువైన కాలాన్ని వృథా చేసుకోవద్దని డీన్లుగా తాము విద్యార్థులకు విన్నవిస్తున్నామన్నారు.

మెస్‌కార్డుల రెన్యూవల్ వివాదం..

- బకాయిలు చెల్లించలేమంటున్న విద్యార్థులు
- కనీసం రూ 2,500 చెల్లిస్తేనే రెన్యూవల్ : హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య

కేయూక్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పూర్తయి మూడో సెమిస్టర్‌లోకి ప్రవేశించిన విద్యార్థులకు హాస్టల్‌వసతి మెస్‌కార్డుల రెన్యూవల్ ప్రక్రియ మొదలైంది. కాగా, గత విద్యాసంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్‌లు పోనూ మిగతా బకాయిల్లో కనీసం రూ . 2,500 మరో రూ. 200 మొత్తం రూ. 2,700 చెల్లించి మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకోవాలని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య కోరుతున్నారు. అయితే తాము మెస్‌బకాయిలు ఇప్పుడు చెల్లించలేమని విద్యార్థులు పేర్కొంటున్నారు. రూ. 200 చెల్లిస్తామని, మెస్ కార్డులు రెన్యూవల్ చేయాలని వారు పట్టుబడుతున్నారు. ఈమేరకు గురువారం హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యతో వాగ్వావాదానికి దిగారు. స్కాలర్‌షిప్‌లు పోనూ రూ. 8వేల నుంచి రూ. 10వేల వరకు మెస్‌బకాయిలు చెల్లించాల్సిన విద్యార్థులున్నారని, అందుకే అందులో కనీసం రూ. 2,500 చెల్లించాలని డైరెక్టర్ విద్యార్థులతో పేర్కొన్నారు. కనీసం వందమంది విద్యార్థులు మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకుంటేనే క్యాంపస్‌లోని కామన్ మెస్ ఓపెన్ చేస్తామని డైరెక్టర్ వెంకయ్య తెలిపారు. కాగా, మహిళా హాస్టల్ విద్యార్థినులకు మెస్‌బిల్లులు కొంత తక్కువగా వస్తున్నాయి. దీంతో ఆయా విద్యార్థినుల బకాయిలు తక్కువ ఉన్నాయి. స్కాలర్‌షిప్‌లు పోనూ బకాయిలు చెల్లించి ఇప్పటివరకు 60నుంచి 70మంది వరకు రెన్యూవల్ చేసుకున్నారు. దీంతో వారికి గురువారం నుంచి మెస్ సౌకర్యం కల్పిస్తున్నారు.

'తానా' సాహిత్య సదస్సుకు లావణ్య


లావణ్య

జనగామ : అంతర్జాతీయ స్థాయిలో జరుగనున్న సదస్సుకు జనగామ జిల్లా కేంద్రానికి చెందిన కవయిత్రి బుద్దా లావణ్య ఎంపికయ్యారు. తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనంలో భాగంగా 'నారీ సాహిత్య భేరీ' నిర్వహించనున్నారు. ఇందులో జనగామకు చెందిన కవయిత్రి బుద్దా లావణ్య తన ప్రతిభ చాటుకోనున్నారు. ప్రపంచంలోని 15 దేశాల నుంచి పోటీ పడుతుండగా, దేశం నుంచి కేవలం 20 మంది కవయిత్రులను మాత్రమే ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుద్దా లావణ్య గురువారం విలేకరులతో మాట్లాడుతూ తానా సంఘం.. ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించేలా కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ వేదికపై తనకు అవకాశం వచ్చేలా కృషి చేసిన తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కవయిత్రి లావణ్యను జరసం అధ్యక్షుడు అయిలా సోమనర్సింహాచారి, కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి, తెరసం జిల్లా అధ్యక్షుడు పొనుగంటి రామమూర్తి, తెరవే రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య, తానా సమన్వయ కర్త చిగురుమళ్ల శ్రీనివాస్, అధ్యక్షుడు నిరంజన్, నిర్వాహకుడు తోటకూర ప్రసాద్ అభినందించారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం, బదిలీ

వరంగల్ లీగల్ : రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, ఖాళీ పోస్టులను భర్తీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (విజిలెన్స్) గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బదిలీ చేసిన ఇద్దరు జడ్జిల స్థానాలతో పాటు ఖాళీగా ఉన్న ఐదు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు న్యాయమూర్తులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జువెనైల్ కోర్టు జడ్జి నేరెళ్ల వెంకటహైమా పూజితను జోగులాంబ గద్వాల పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ చేస్తూ, ఆ స్థానంలో నందికొండ రితికాను నియమించారు. జనగామ జువెనైల్ కోర్టు జడ్జి సీహెచ్ నర్మదను రంగారెడ్డి జిల్లా ఎల్బీ నగర్ కోర్టుకు బదిలీ చేయగా, ఆ స్థానానికి కొప్పుల సందీపను నియమించారు. ఖాళీగా ఉన్న వరంగల్ రెండో మున్సిఫ్ కోర్టు జడ్జిగా బి.వెంకటచంద్ర ప్రసన్న, మూడో మున్సిఫ్ కోర్టు జడ్జిగా ఎ.హరికాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగో మున్సిఫ్ కోర్టు జడ్జిగా మహ్మద్ ఫరిహాఅహ్మద్, పీసీఆర్ కోర్టు జడ్జిగా చెన్ను లీలా నాగసుస్మితను నియమించారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా జువెనల్ కోర్టు జడ్జిగా గంగినేని అఖిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్ఎల్ఎం పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎల్ఎల్ఎం రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30 వతేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించాలన్నారు. రూ 250 అపరాధ రుసుముతో అక్టోబర్ 4వతేదీ వరకు గడువు ఉందన్నారు.

ఎల్ఎల్‌బీ మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఎల్ఎల్‌బీ మూడేళ్ల రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం అధికారులు మల్లారెడ్డి, రాధిక తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 30, అక్టోబర్ 4, 6 వతేదీల్లో జరుగుతాయని తెలిపారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, అక్టోబర్ 3, 5, 7వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

ఐదేళ్ల 'లా' కోర్సు రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఐదేళ్ల 'లా' కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25,27, 30, అక్టోబర్ 4వ తేదీల్లో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, అక్టోబర్ 3, 5వతేదీల్లో జరుగుతాయి. వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

ఉడుమును పట్టుకున్న యువకుడు.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మూగజీవి ఉడుమును పట్టుకుని ఉన్న ఓ యువకుడి ఫొటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీంతో అటవీ శాఖ అధికారులు.. ఆ యువకుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు గురువారం అటవీ శాఖ మహబూబాబాద్ రేంజ్ కార్యాలయంలో డోర్నకల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రేణుక కేసు వివరాలు వెల్లడించారు. కురవి మండలానికి చెందిన జీ రఘు తన చేతిలో ఓ ఉడుమును పట్టుకుని ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోలను 'ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' సభ్యుడు గౌతమ్ అటవీ శాఖ ఉన్నతాధికారులకు పంపించి ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు డోర్నకల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రేణుక, సెక్షన్ అధికారి శ్రీనివాస్ .. రఘును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

విహారం.. విషాదం..

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నలుగురికి తీవ్ర గాయాలు


నిస్సి (ఫైల్)

ములుగు రూరల్ /కాజీపేట అర్బన్: వరంగల్ నిట్ విద్యార్థుల విహారయాత్ర విషాదమైంది. పర్యాటక ప్రాంతాలను సందర్శించి తిరుగు ప్రయాణమైన వారి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పక్కన ఆగి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున ములుగు మండలం జంగాలపల్లిలో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ముర్తుజా, ఉమర్, సాయి, సుజిత్, ఏపీలోని విజయవాడకు చెందిన శ్రేయ, తాడేపల్లిగూడేనికి చెందిన నిస్సి సిజు.. వరంగల్ నిట్‌లో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. తిరుగు ప్రయాణంలో ములుగు మండలం జంగాలపల్లిలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఆరుగురు విద్యార్థుల్లో నిస్సి సిజు (19) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రంజిత్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్ వెంటనే ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. మిగతా విద్యార్థులు శ్రేయ, ముర్తుజ, ఉమర్, సుజిత్‌కు తీవ్ర గాయాలు కావడంతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. నిస్సి మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. కాగా, రోడ్డు ప్రమాదంలో ఫ్రెండ్ మృతి చెందిన విషయం తెలుసుకొని నిట్ విద్యార్థులు ములుగు ఏరియా ఆస్పత్రికి వచ్చి బోరున విలపించారు. మృతురాలి కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడికి గురి చేశాయి. కాగా, బాధిత కుటుంబాలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ పరామర్శించారు.

ఇలా జరుగుతుందని అనుకోలేదు..



నేను, నా మిత్రులు ముర్తుజా, ఉమర్, సాయి, శ్రేయ, నిస్సి ఫుడ్ కోసం హనుమకొండ బాలసముద్రంలోని ఓ హోటల్‌కు వెళ్లాం. అక్కడ ఆలస్యం కావడంతో సరదాగా కారులో లక్నవరం బయలుదేరాం. కానీ రోడ్డు ప్రమాదం అవుతుందని, మాకు ఇలా జరుగుతుందని అనుకోలేదు. గురువారం తెల్ల వారుజామున చోటుచేసుకున్న ప్రమాదంలో అసలేం జరిగిందో అర్థం కాలేదు. లారీ ఒక్కసారిగా ఓవర్ టేక్ చేయడంతో కారు నడిపే మా స్నేహితుడికి ఏం చేయాలో తెలియలేదు.

–సుజిత్, నిట్ విద్యార్థి

ఏడు నెలలు గడవకముందే..

నిట్ వరంగల్‌కు చెందిన థర్డ్ ఇయర్ విద్యార్థి రిత్విక్ ఏడు నెలల క్రితం క్యాంపస్ నుంచి రాత్రి పది గంటలకు బయలుదేరి ఆరెపల్లి ప్రాంతంలోని వంగపహాడ్ దగ్గర బైక్‌పై ప్రయాణిస్తూ ప్రమాదంలో మృతి చెందాడు. రిత్విక్ మృతి చెంది ఏడు నెలలు గడవకముందే నిట్‌కు చెందిన మరో ఆరుగురు విద్యార్థులు కారు యాక్సిడెంట్‌కు గురికావడం.. ఇందులో ఒకరు మృతి చెందడం పలువురిని కంటతడికి గురి చేసింది.

రోజూ బయటకు ఎందుకు..?

నిట్ క్యాంపస్‌లో 6వేల మంది విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు క్లాస్ రూంలు, ల్యాబ్స్, సెమినార్ హాల్స్ ఉన్నాయి. అలాగే, భోజనం, వసతికి బాలురకు 1కే,1.8కే, బాలికలకు న్యూ.ఓల్డ్ బ్లాక్, ప్రియదర్శిని బ్లాక్‌ల్లో వసతి ఏర్పాట్లకు గాను కళాశాల ఫీజుతోపాటు మెస్‌కు గాను ఏడాదికి రూ. 14వేలు తీసుకుంటున్నారు. రోజూ ఉదయం టీ, టిఫిన్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందిస్తుంటారు. ఇలా రోజూ అందిస్తున్నా ఫుడ్ కోసం విద్యార్థులు బయటకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించే నాథులే లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా నిట్ యాజమాన్యం విద్యార్థులకు భద్రత కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


నుజ్జునుజ్జయిన కారును తొలగిస్తున్న పోలీసులు